"విస్తట్లో అన్నం వడ్డించి విసుక్కునే బదులు — అసలు సంగతేమిటో ఏడవరాదూ?" అన్నాడు వెంకట్రాయుడు, అన్నంతో వేలిగిన్నె వంచుకుంటూ.

"అవును — నా విసుగే కనిపిస్తుంది కాని, [illegible] మాటన్నప్పుడు [illegible]. పాపకి పొంగు జ్వరం తగ్గిన తరవాత మన గ్రామ [illegible] పట్టుచీర, [illegible] కట్నాలు [illegible] మొక్కుకున్నాం కదా? గత పది రోజుల్లోనూ అప్పుడే నాలుగుమార్లు కాకినాడ వెళ్లి వచ్చారు! నేను చెప్పిన పట్టుచీర సంగతి మరిచిపోతున్నారు! అమ్మవారి జాతర పట్టుమని పదిహేను రోజులు కూడా లేదు. మన మొక్కు తీర్చుకోవడానికి ఎల్లుండి శుక్రవారం రోజు మంచిది. మనం ఆలస్యం చేసినకొద్దీ, దగ్గర పడుతున్న జాతర మూలంగా, రద్దీ ఎక్కువై పోతుంది" అన్నది తాయారు, సాధింపుగా.

"దీని కింత రాద్ధాంతం ఎందుకు? మొక్కుకున్నవాటికి సరిపడగా డబ్బు ఇద్దాం" అన్నాడు వెంకట్రాయుడు తేలికగా.



"అలా అపచారం మాటలు మాట్లాడకండి. ఇదే ఏ తిరుపతి మొక్కో అయితే, ఇలా అనేవారా మీరు? ఊరి అమ్మవారు కదా అని పోలేరమ్మని గురించి అంత చులకనగా మాట్లాడకండి. మీరు భోజనం అయిన వెంటనే కాకినాడ వెళ్ళి, లేత గులాబీ రంగు కంచి పట్టుచీర కొని తెండి. వెండి గరగా, కళ్ళూ చేయమని బ్రహ్మనికి పురమాయించాను. ఈ సాయంత్రానికి తీసుకొస్తాడు. అతనికి అరవై రూపాయ లివ్వాలి. ఆ డబ్బు నా కిచ్చి వెళ్లండి."

"కంచి పట్టు చీర అంటే నూట ఏభై రూపాయలకు తక్కువ ఉండదు. మొత్తం మొక్కు తీరేసరికి రెండు వందలు దాటిపోతుంది. కాకినాడ వెళ్లడం ఎందుకు కాని, మన సత్తిరాజు కొట్లో నలభై, ఏభై రూపాయల్లో ఓ చీర తెస్తాను — ఏమంటావు?" అన్నాడు కొంచెంగా నసుగుతూ వెంకట్రాయుడు.

"మనకి డబ్బు లేకపోతే అనుకోవచ్చు. కావలసింది పాప ఆరోగ్యం. అమ్మవారి చల్లటి చూపుతోనే అది బతికి బయట పడింది. ఈ విషయంలో మటుకు మీ మాట వినేది లేదు! అందులోనూ కాకినాడ ప్రయాణం ఎంతసేపని? సరిగా గంట కూడా పట్టదు. మీరు రెండింటికి బయలుదేరినా, చీకటి పడక మునుపే తిరిగి రాగలరు" అన్నది తాయారు, తన మాటల కింక తిరుగులే దన్నట్టుగా.

వెంకట్రాయుడు మరి మాట్లాడ లేదు. రెండింటికల్లా బట్టలు వేసుకొని, పెళ్ళాం చేతికి వంద రూపాయల నోటిచ్చి కాకినాడ వెళ్ళాడు.

సాయంత్రానికి బ్రహ్మం వెండి కళ్ళూ, గరగా తీసుకొని వచ్చాడు. తాయారు డబ్బిచ్చి, అతణ్ణి పంపించింది. రాత్రి ఏడింటికల్లా వెంకట్రాయుడు తిరిగి వచ్చాడు. మొగుడి చేతిలో చీర అందుకొంటూ, "సరిగా చూసి తెచ్చారా?" అని ప్రశ్నించింది తాయారు.

"నా కళ్లకి ఆనని లోపాలు నీకు కనపడ వచ్చు. నీ తృప్తికోసం చీర మడత విప్పి చూడు" అన్నాడు వెంకట్రాయుడు.

తాయారు చీర మడత విప్పి బల్ల మీద పరిచింది. "గులాబీ రంగు మరీ లేతగా ఉన్నట్టుంది. వెండి జరీ అంచు మట్టుకు చాలా బాగా నప్పింది. చీర మీద జరీ పువ్వులు కూడా బాగున్నాయి. ఫరవాలేదు లెండి—ఇంత కాలానికి మంచి ఎన్నిక చేశారు. మీరు వెళ్ళి స్నానం చెయ్యండి నీళ్ళు తోడి సిద్ధంగా ఉంచాను" అన్నది తాయారు, ఆప్యాయంగా.



ఏకపాదమూర్తి (తిరువత్తియూరు)

ఫోటో— ఐ భాస్కరశర్మ (మద్రాసు-1)

శుక్రవారం సూర్యోదయం మునుపే తాయారు లేచి ఇంటిపనులన్నీ త్వరగా కానిచ్చేసింది. ఆరేళ్ల పాపని బలవంతంగా లేపి పళ్ళుతోమి, తలంటుపోసి కొత్త గౌను తొడిగింది. తను కూడా తలస్నానం చేసి, నీలం రంగు పట్టుచీర కట్టింది. తళతళా మెరుస్తున్న ఓ పెద్ద ఇత్తడి పళ్ళెంలో కొత్తగా కొన్న చీరా, వెండి గరగా, కళ్ళూ, పసుపుకుంకుమలూ, అగరువత్తులూ అమర్చింది. మరో పళ్ళెంలో ఓ డజను అరటిపళ్ళూ, కొబ్బరికాయా ఉంచింది.

అన్నీ అమరిన తరవాత గుర్రు పెట్టి నిద్రపోతున్న మొగుణ్ణి లేపి, "ఈ వేళ మనం గుడికి వెళ్ళి మొక్కు తీర్చుకొని వస్తేకాని, మీకు కాఫీనీళ్ళు దొరకవు. అందుకని త్వరగా తెమలండి. ఈలోగా పానకం తయారు చేస్తాను" అన్నది తాయారు.

మరో అరగంటకల్లా వెంకట్రాయుడు తయారయ్యాడు. రిక్షాకోసం వెళ్లబోతున్న మొగుణ్ణి ఆపి తాయారు అంది: "రిక్షా వద్దు. అరమైలు దూరం నడవలేరా ఏమిటి! తిరుపతి కొండ నడిచి ఎక్కలేదూ?"

"సామానన్నీ ఎవడు మోస్తాడు?" వెంకట్రాయుడు విసుగ్గా అన్నాడు.

"చీర పళ్ళెం, పానకం చెంబూ నేను పట్టుకొస్తాను. అరటిపళ్ల పళ్ళెం మీరు పట్టుకోండి. అంతగా సిగ్గయితే, పళ్ళూ, కొబ్బరికాయా చేతి సంచీలో పెడతాను. కావలిస్తే వచ్చేటప్పుడు రిక్షా మీద వద్దాం."

"నీకు మరీ చాదస్తం. అయితే త్వరగా పద. తిరిగి వచ్చి ఇంత కాఫీ తాగితే కాని మరి బండి నడవదు. అవతల పొలంలో బోలెడు పనులున్నాయి. ఇంతకీ పాప ఏదీ?"

"అది ఇందాకట్నించీ వీధి అరుగు మీద కూర్చుంది. మనదే ఆలస్యం" అంటూ తాయారు మేకునున్న గుడ్డ సంచీ అందుకుంది.

గుడి చేరేసరికి తలుపులు తీసిఉన్నాయి. జనం ఎవరూ లేరు. వీళ్లని చూసి ఆవరణలో వందుంపుల్లతో పళ్ళు తోముకుంటున్న అర్చకుడు తాతబ్బాయి గబగబా ఇన్ని నీళ్ళు పుక్కిలించి, మీద నున్న తుండుగుడ్డతో మొహం తుడుచుకొంటూ వచ్చాడు. "రండయ్యా రండి. ఇదుగో ఒక్క నిమిషం" అన్నాడు, కోరా కిళ్లీ నమిలి నమిలి గారకట్టిన పళ్ళు ఇకిలిస్తూ, ఆప్యాయత ఒలకబోస్తూ.

భుజాలవరకూ దిగిన గిరజాల జుట్టుని ముడిపెట్టి, ఇంత కుంకం తీసి ముఖాన బొట్టు పెట్టుకొన్నాడు. మూల విరాట్టు ముందున్న ప్రమిదలో నూనె పోసి, దీపం వెలిగించాడు. తుండుగుడ్డ తీసి, పొట్టమీద నుంచి దిగజారబోతున్న లుంగీ మీదుగా బిగించి కట్టాడు. మెడమీద బరబరా గోక్కుంటూ, "రండమ్మా, ఇలా లోపలికి రండి" అన్నాడు. ఓ పళ్లెం అమ్మవారి పాదాల ముందు ఉంచాడు.

తాయారు అమ్మవారి పాదం మీద నుంచి కుంకం తీసి బొట్టు పెట్టుకుని, పాపకి కూడా పెట్టింది. అగరువత్తులు వెలిగించి, ఓ అరటిపండులో గుచ్చి పక్కగా ఉంచింది. వెండి కళ్ళు పాప కళ్ళకోసారి అంటించి, పట్టుచీరమీద గరగనీ, వెండి కళ్లనీ ఉంచి పళ్లెంలో పెట్టింది. వెంకట్రాయుడు అరటి పళ్ళూ, కొబ్బరికాయా, ఓ అయిదు రూపాయల కాగితం ఉంచాడు.

తను తీసుకొచ్చిన పసుపు కుంకుమలు అమ్మవారి పాదం మీద ఉంచి, తిరిగి కొంత తీసి తను తెచ్చిన పళ్లెంలో వేసింది తాయారు.

అమ్మవారి విగ్రహంకేసి భయం భయంగా చూస్తూ నిలుచున్న పాప నుద్దేశించి, "భయంలేదమ్మా, పాపా! నిన్ను కాపాడింది ఈ చల్లటి తల్లే! భక్తిగా దణ్ణం పెట్టు" అంటూ తను కూడా కళ్ళు మూసుకుని ఓ రెండు నిమిషాల పాటు అమ్మవారిని ధ్యానిస్తూ నమస్కరించింది.

తాతబ్బాయి కొబ్బరికాయ కొట్టి, సగం పళ్ళూ, కొబ్బరి చెక్కా వెంకట్రాయుడి కందించాడు.

"అమ్మవారి పెద్ద సంబరం ఎప్పుడవుతుంది?" తాయారు తాతబ్బాయిని ప్రశ్నించింది.

"పోలే రమావాశ్య — అంటే ఎల్లుండి ఆదివారం కాక, ఆ పై ఆదివారం అవుతుంది" అన్నాడు తాతబ్బాయి, వినయంగా.

"ఈ ఏడాది కూడా ఊరేగింపులు జరుగుతున్నాయా?"

"అదేమిటమ్మా, అలా అడుగుతున్నారు! ? ఊరేగింపులు జరగని ఏడు ఒక్కటైనా ఉందా?"

"అడగడంకోసం కాదు కాని — ఈ చీర నూట ఏభై రూపాయలు పెట్టి కొన్నాం. ఊరేగింపు రోజున అమ్మవారి ఉత్సవ విగ్రహానికికాని, పువ్వుల గరగకి

## 'ఎలక్షన్'

కాని ఈ చిరని కట్టబెడితే, నా జన్మ తరించినట్లు భావిస్తాను."

"దానికేం భాగ్యం? ఊరేగింపు రోజున ఎలా సీలుంటే, అలా చేస్తాను. ఆ భారం నామీద వదిలెయ్యండి."

"మరిచిపోకూడదు మరి. మధ్యలో కబురు పంపి జ్ఞాపకం చేయించనా?"

"ఎందుకండీ పిూకంత శ్రమ? మరిచి పోవడ మనేది జరగదు." తాతబ్బాయి భరోసా ఇచ్చాడు.

తాయారు సంతృప్తిగా బయటకు నడిచింది. చెంబులోని పానకాన్ని పోతరాజు విగ్రహం మీద పోసింది.

రిక్షా ఎక్కి ఇంటికి వెడుతూంటే మధ్య దారిలో అన్నాడు వెంకట్రాయుడు: "మనకే ఈ భయభక్తులన్నీ. స్నానం కూడా చెయ్యకుండా — ఆ జేబురు గొట్టు మొహంగాడి అర్చకత్వం బాగానే ఉంది కదూ?" తాతబ్బాయిని చూసి తాయారుకి కూడా చీదరింపు కలిగిన మాట వాస్తవమే అయినా, మొగుడు మరింత హేళన చేస్తాడేమోనని సమాధానం ఇవ్వలేదు.

తాయారు ఎదురుచూసిన సంబరం రోజు రానే వచ్చింది. దూరంగా బాజాల మోత వినిపిస్తూంది.

వీధి అరుగు మీద పడక కుర్చీ వేసుకొని, సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు వెంకట్రాయుడు. జంబుఖానా పరుచుకొని, సంబరం ఎప్పుడు దగ్గర వడుతుందా అని ఎదురుచూస్తూ కూర్చుంది తాయారు.

ఎప్పుడోకాని కరెంటు దీపం ఎరగని ఆ రోడ్డు, గాస్ లైట్ల కాంతిలో కొత్త అందం పుంజుకోసాగింది. చూస్తూండగానే సంబరం దగ్గరి కొచ్చేసింది.

పచ్చరంగు దుస్తులు ధరించిన ఓ పాతిక మంది యువకులు డప్పులు వాయిస్తూ, లయబద్ధంగా గిరగిర తిరుగుతూ ముందుకు సాగిపోయారు.

లోకంలోని అవినీతిలా తాటకి ప్రళయ నృత్యం చేస్తూ వచ్చింది. రామలక్ష్మణులు మొద్దుబారిన క్రూర బాణాలు మధ్య మధ్యలో తాటకి మీద విసురుతున్నారు. రాము డలిసి పోయాడు. దాహం అన్నట్లుగా సంజ్ఞ చేశాడు. పక్కనే ఉన్న ఒకతను సంచీలోంచి బుడ్డి తీసి రాముడి కందించాడు. జనం గొల్లుమన్నారు. తాటకి ముందుకు సాగిపోయింది. దాహం తీరిన రాముడు తాటకి వెనక పడ్డాడు. 'అపచారం మనుషులు' అనుకుంది తాయారు.

అంతలోనే గజ్జెల చప్పుడు. చేతులు లాస్యంగా తిప్పుతూ, ఓ పది మంది నడివయస్కులు నెత్తిమీద గరగలు పెట్టుకొని, డప్పుల మోత కనుగుణంగా నాట్యం చేస్తూ వచ్చారు. తాయారు ఆశగా గరకలకేసి చూసింది. అమ్మవారి పువ్వుల గరగ మధ్యగా ఉంది. చక్కగా పువ్వులు అలంకరించి ఉన్నాయి. పువ్వులకి కిందుగా రంగు వెలిసిపోయిన ఓ పాత నీలం చీర కానవచ్చింది. గరగల వాళ్ల ఒంటిమీద స్పృహ లేదు. అందరూ మందు నిషాలో, వెర్రి ఆవేశంతో నాట్యం చేస్తూ నడిచి పోయారు. నిరుత్సాహంగా నిట్టూర్పు విడిచింది తాయారు.

అపశ్రుతులూ, అవకతవకలతో నారాయుడి సన్నాయి మేళం కదిలి వెళ్లింది. 'క్షవరాలు చేసే నేర్పు, వీడికి సన్నాయి వాయించడంలో రాలేదు' అనుకొన్నాడు వెంకట్రాయుడు.

ఓ కొత్త సినిమా పాటని జోరుగా వాయించేస్తూంది, పట్నం నుంచి వచ్చిన బాండు మేళం. "అమ్మవారిసంబరంలో— ఛ! ఇవేం పాడు పాటలండీ?" అని చీదరించుకుంది తాయారు.

రెండెడ్ల బండిమీద అమర్చిన సింహాసనం మీద కూర్చున్న ఆదిశక్తి కాలి కింద పడుకొని ఉన్నాడు మహిషాసురుడు. ఒక చేతిలో ఉన్న త్రిశూలం మహిషాసురుడి నడ్డిమీద పెట్టి, రెండో చేత్తో మధ్య మధ్యన మూతిమీద లేని మీసాన్ని తిప్పుతున్నాడు, ఆదిశక్తి వేషధారి. అతనలా చేసినప్పుడల్లా జనం కేరింతాలు కొడుతున్నారు.

"అమ్మవారి ఉత్సవ విగ్రహం ఇంకా రావటం లేదేమండి? క్రితం ఏడు ముందుగా అమ్మవారి సల్లకే కదూ ఉంట?" తాయారు ప్రశ్నించింది.

"ఈ ఏడు చివర్న ఉంచారేమో? కంగారెందుకు?" అన్నాడు వెంకట్రాయుడు తాపీగా.

చూస్తూండగానే మేజువాణీ దగ్గరి కొచ్చింది. వెంకట్రాయుడు కొంచెం నిటారుగా లేచి కూర్చున్నాడు. "అమ్మవారి ఉత్సవాల్లో కూడా బోగం మేళాలు! ఏం కాలం ..." తాయారు నోట మరి మాట రాలేదు.



సంబరం

ఫోటో— కె. వి. రావు ( మద్రాసు-14 )

మొహాల నిండా అరంగుళం స్నో పౌడర్లు రాసుకుని నృత్యం చేస్తున్న ఆ యువతుల కేసి చూస్తూ ఉండిపోయింది తాయారు. అటు ముగ్గురూ, ఇటు ముగ్గురూ తెల్లటి పలచటి చీరలు కట్టి అడుగులు వేస్తున్నారు. మధ్యగా ఉన్న సూరేకాంతం శ్రావ్యంగా గొంతెత్తి పాడుతూంది. ధగధగా మెరుస్తున్న లేత గులాబీ రంగు, జరీ అంచు, జరీ పువ్వుల చీర కట్టిన సూరేకాంతాన్ని జనం వెర్రిగా చూస్తున్నారు. తాయారుకి నడ్డి విరిగినట్లయింది.

గ్లాస్గో పంచె, పెద్దాపురం సిల్కు లాల్చీ, జరీ కండువా వేసుకొని తాతబ్బాయి నిషాలో ఉన్నాడు. జనాన్ని అదిలిస్తున్నాడు. పక్క వాద్యగాళ్లని హెచ్చరిస్తున్నాడు. మధ్య మధ్యలో సూరేకాంతం కేసి ముసిముసి నవ్వులు నవ్వుతూ చూస్తున్నాడు.

"చూశారా ఎంత దారుణమో!? అది మనమిచ్చిన చీరే నండి! తాతబ్బాయికి ఎన్ని గుండెలు!? నిలదీసి అడగరాదూ?" అన్నది తాయారు, కోపంగా.

"అనవసరంగాఆవేశపడకు.గొడవపడితే నలుగురిలోనూ నవ్వులాటగా ఉంటుంది. నీ భక్తి కొద్దీ సువ్విచ్చావు. తరవాత పాపం అంతా అతనిదే. అయినా ..." వెంకట్రాయుడు ఇంకా ఏదో అనబోయి, మాట ఆపేశాడు.

"అవును, తాతబ్బాయి అన్న మాట నిలబెట్టుకొన్నాడు. చీరని గ్రామదేవతకే కట్టబెట్టాడు. నా సరదా బాగా తీరింది! అమ్మవారికి నా మీద ఇంతే అనుగ్రహం ఉంది" అని తాయారు లేచి లోపలికి వెళ్లిపోయింది, వెనకనే వస్తున్న అమ్మవారి సల్లకి కోసం ఆగకుండానే.

నల్లటి ఆకాశంలోకి వెళ్లి, వెలుగు రవ్వల్ని చిమ్ముతున్నాయి తారాజువ్వలు. ఆ వెలుగు రవ్వల మధ్య — ఆ నాడు గుళ్లోని తాతబ్బాయి వికార స్వరూపం కదలాడింది. అనేక పర్యాయాలు తనకి సుఖాన్నందించిన సూరేకాంతం తాతబ్బాయి కౌగిలిలో నలిగిపోతూంది. వెంకట్రాయుడికి వెలపరింపు కలిగింది. మరో తారాజువ్వ రంగుల పువ్వుల్ని వెదజల్లింది. వెంకట్రాయుడికి అంధకారంలో వెలుగు రేఖ గోచరించింది. 'ఛస్తే సూరేకాంతం గడప తొక్కను' అని ఒట్టు పెట్టుకొన్నాడు.

వెంకట్రాయుడు సూరేకాంతం గుమ్మమే కాదు, ఆ వాడ ముఖం మరి జన్మలో చూడలేదు.

అమ్మవారు చేసిన మేలు తాయారుకి తెలియదు. ★